11

# శ్రీరాముడు,శ్రీయేసుక్రీస్తు ఇరువురి ఆత్మ ఒక్కటే అని గ్రహించిన శ్రీశేషుదేవులు

1970లో శ్రీ శేషుబాబు గారు పదహారేళ్ళ వయస్సులో ఇంటర్మీడియెట్ చదువుతున్న సమయములో కమ్యూనిజం సిద్ధాంతం కూడా పేదప్రజలందరికీ సమన్యాయం అందీయలేదని గ్రహించినాక సమన్యాయం కొరకు అన్వేషించుటలో ఆయన దృష్టి దేవుని వైపు మరలినది. దేవుని గురించి తెలుసుకొనుటకై ఆయన దైవ గ్రంధములు ఏమీ చదువలేదు కానీ దేవునికి సంబంధించిన పౌరాణిక సినిమాలను చూచేవారు. దేవుని గురించి తెలుసుకోవాలనే ఆసక్తితో పౌరాణిక సినిమాలు చూచేవారు

శ్రీ శేషుబాబుగారు దైవగ్రంధములు వేటినీ చదువలేదు. ఆయన చుట్టూ ఉండే మనుష్యులను, పరిస్థితులను నిశితంగా పరిశీలించుట ద్వారానే సత్యమును గ్రహించేవారు. సినిమాల ద్వారానే శ్రీరామాయణము, శ్రీ మహాభారతము, శ్రీమద్భాగవతము, శ్రీ యేసుక్రీస్తు చరిత్ర, మహాపురుషుల చరిత్రలు, భక్తుల చరిత్రలు తెలుసుకుని వాటిలోని సత్యమును సంపూర్ణముగా అర్థము చేసుకునేవారు.

continue....

శ్రీ శేషుబాబు గారు శ్రీరామునికి సంబంధించిన సినిమాను చూస్తే, శ్రీరాముని యొక్క తత్వమంతా ఆయనకు అర్ధమైపోయేది. శ్రీకృష్ణుని సినిమా చూస్తే, శ్రీకృష్ణుని తత్వమంతా ఆయనకు అర్ధమైపోయేది. అలాగే శ్రీ యేసుక్రీస్తు సినిమా చూచినా, శ్రీ సాయిబాబా సినిమా చూచినా ఏ మహాపురుషుల సినిమా చూచినా  ఆయా మహాపురుషుల, దైవీ పురుషుల తత్వము ఆయనకు పూర్తిగా అర్ధమైపోయేది. ఏ చరిత్ర చూచినా ఆ చరిత్రలో ఉన్న సత్యసూత్రములు, ఆధ్యాత్మిక మర్మములు ఏవీ ఆయన ఆలోచనాశక్తిని దాటిపోయేవి కావు. ఆయన ఆ సినిమా ద్వారా ఆ చరిత్రను తెలుసుకుంటున్నట్లుగా ఉండేది కాదు. తనకు పూర్వమే పూర్తిగా తెలిసున్న దానిని ఆ సినిమా ద్వారా మరల గుర్తుచేసుకుంటున్నట్లుగా ఉండేది. సామాన్యజనులు సినిమా చూసే పద్దతికి, శ్రీ శేషుబాబు గారు సినిమా చూసే పద్దతికి చాలా తేడా ఉండేది. ఉదాహరణకు సామాన్యజనులు ఎవరైనా లవకుశ అనే సినిమా చూస్తే, శ్రీరాముడు కూడా పురుషాధిక్య భావముతో స్త్రీయైన తన భార్య శ్రీ సీతామాతను అన్యాయముగా అరణ్యములకు పంపినాడేమో అనే భ్రమకు లోనయ్యే అవకాశమున్నది.

కానీ అదే లవకుశ సినిమాను శ్రీ శేషుబాబు గారు చూచి ఇలాగ ఆలోచించేవారు "శ్రీరాముడు గొప్ప చక్రవర్తి, రావణాసురుడంతటి అరివీర భయంకరుడైన దానవుని కూడా యుద్ధములో జయించిన మహా పరాక్రమవంతుడు. తన రాజ్యములోని ఎంతటి వారినైనా శిక్షించగల అధికారి అయివున్నారు. అంతటి చక్రవర్తి భార్యను ఆయన రాజ్యములోని అత్యల్ప స్థాయిలో ఉన్న పేద చాకలివాడు అకారణముగా నిందించినాడు. శ్రీరాముడంతటి చక్రవర్తి కానక్కరలేదు, మామూలు చిన్న సామంతరాజైనా గానీ తన భార్యను ఆ విధముగా నిందించినవాని తలను వెంటనే నరికించి వేస్తాడు. ఇంకెవ్వరూ అట్టి పిచ్చివాగుడు వాగకుండుటకై హెచ్చరికగా అతని తలను కోటగుమ్మానికి వ్రేలాడ దీస్తాడు కదా. కానీ ఈ శ్రీరాముడేమిటి ? తన యెడల తప్పు చేసిన వానిని శిక్షించుట మానేసి, తనలోనే తప్పు ఉన్నదేమోనని అత్మవిమర్శ చేసుకుంటున్నారేమిటి ? తనలో తప్పు లేకపోయినా గానీ ఎదుటి వ్యక్తి అన్నాడు కాబట్టి తనలో తప్పు ఉండేయుంటుందని భావిస్తూ ఆ తప్పుకు శిక్షగా తనను, తన బహిఃప్రాణమైన తన భార్యను శిక్షించుకుంటున్నారేమిటి ? ధనాధిక్యత వలన భూస్వాములు ధనమత్తుకు లోబడిపోయి పేదలను బాధించుచున్నారు.

continue...

అధికారము వలన కమ్యూనిష్టులు అధికారమత్తుకు లోబడిపోయి పేదలకు సమన్యాయము అందీయలేకపోవుచున్నారు. కానీ ఈ శ్రీరామునికి అంతటి ధనాధిక్యత, అధికారము ఉన్నా కూడా వాటి మత్తు ఆయన మనస్సుకు అణుమాత్రమైనా పట్టుట లేదు. అలా పట్టక పోవుటకు ఆయనలోని ఆత్మవిమర్శయే సాధనమగుచున్నది. ఆత్మవిమర్శతోనే శ్రీరాముడు పేద చాకలివానిని కూడా చక్రవర్తితో సమానముగా ప్రేమించుచూ సాటి మానవుని కొరకు తనను తానే శిక్షించుకుంటున్న కరుణామయుడైయున్నారు. భూస్వాములు, కమ్యూనిష్టులు, ప్రజలందరూ ముందుగా ఆత్మవిమర్శను నేర్చుకుంటే అప్పుడు అందరికి సమన్యాయము అందుతుంది.

శ్రీ యేసుప్రభువు పేదల బాధలను చూడలేక కళ్ళు లేనివారికి కళ్ళు, కాళ్ళు లేనివారికి కాళ్ళు ప్రసాదించినారు. ఆకలి గొన్నవారికి ఆహారాన్ని పంచిపెట్టినారు. కుడిచెంపపై కొట్టువానికి ఎడమచెంప కూడా చూపించమంటు సాటి మనిషిని ప్రేమించమన్నారు. మరణించిన వానిని తిరిగి బ్రతికించగల శక్తిమంతుడైయుండి కూడా తనను ద్వేషభావముతో శిలువ వేస్తున్న వారినైనా తన శక్తితో ఎదిరించకుండా జాలినే చూపించినారు. శిలువ వేస్తున్న సైనికులను క్షమించమని భగవంతుని ప్రార్థించినారు. సాటి మనుషులను ప్రేమిస్తూ తనను తానే శిక్షించుకుంటున్నారు. శ్రీ యేసుప్రభువు, శ్రీరాముడు ఇద్దరూ ఒకేలాటి మనస్సును కలిగియున్నారు. శ్రీరాముడు అయోధ్యలో చక్రవర్తిగాయున్నారు. శ్రీ యేసుప్రభువు యెరూషలేములో బోధకునిగాయున్నారు. వారి ఉపాధులే వేరుగా ఉన్నవి కానీ ఇరువురి మనస్సు, ఆత్మ ఒకేలా ఉన్నవి. ఇరువురును సాటివారిని ప్రేమిస్తూ తమను తాము శిక్షించుకుంటున్న కరుణామయులే అయియున్నారు.

ఇరువురు ఒకే సిద్ధాంతాన్ని ఆచరిస్తున్నప్పుడు ఈ హైందవము, ఈ క్రైస్తవము అని విభిన్న పద్ధతులు, విభిన్న సిద్ధాంతములు ఎందుకున్నవి ? ఈమత సిద్ధాంతములు, మత ఆచారములు అన్నీ మనుష్యుల చేత మధ్యలో కల్పించబడినవే అయియున్నవి. కావున మధ్యలో వచ్చిన వన్నీ నాకనవసరం. శ్రీరాముడు, శ్రీ యేసుక్రీస్తు ఆచరించినది, బోధించినది ఒక్కటే అదియే కావలసినది. సాటి మనిషిని ప్రేమించుటయే భక్తియు,

continue...

పూజయు అని వారు చెప్పినారు. వారిరుపురును అలా సాటి మనిషిని ప్రేమించుటలో తమను తామే శిక్షించుకునే అత్యున్నత స్థాయికి చేరిపోయినారు. కాబట్టియే వారు భగవంతులైనారు. భగవంతుడనేవాడు ఉన్నను లేకపోయినను గానీ సాటిమానవులపై అంతటి ప్రేమను పంచి ఇచ్చిన ఆ కరుణామయులను గొప్పవారిగా, భగవంతునిగా గౌరవించుట, పూజించుట మానవజాతికి మంచిదే అయియున్నది." అంటూ ఈ విధముగా ఆలోచించేవారు. ఈ విధముగా శ్రీ శేషుబాబు గారు ఏ సినిమా చూచినా దానిలోని సత్యాన్ని సంపూర్ణముగా గ్రహించేవారు. శ్రీ శేషుబాబు గారి సత్యాన్వేషణ ఈ విధముగా ప్రారంభమైనది.

